సాక్షి
కుమురం భీం

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



వీడని హత్య మిస్టరీ..? 8లో ▸

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీ హత్య కేసు మిస్టరీగా మారింది. గుడిపేట వైద్యకళాశాల వెనక వైపు అటవీ శివారు ప్రాంతంలో తవ్వకాలు జరిపినా మృతదేహం లభ్యం కాలేదు.



యథేచ్ఛగా అక్రమ రవాణా

పశువులపై కర్కశత్వం ఆగడం లేదు. కనీసం జాలి చూపకుండా, నిబంధనలు పాటించకుండా కబేళాలకు తరలిస్తున్న క్రమంలో మృత్యువాత పడుతున్నాయి. 9లో ▸

గరిష్టం/కనిష్టం
29.5 /24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తగ్గుతాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ వహీఉద్దీన్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ డీఎస్పీగా ఎండీ వహీఉద్దీన్ శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి ఆయన బదిలీపై కాగజ్‌నగర్‌కు వచ్చారు. అంతకుముందు ఇక్కడ డీఎస్పీగా ఉన్న రామానుజం ఏఎస్పీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.

రేపు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 7న సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన సీనియర్ పురుషులు, మహిళా క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అంతర్ జిల్లాల పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 27 వరకు గోవా రాష్ట్రంలోని మధగాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల జిల్లా క్రీడాకారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెపక్‌తక్రా అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమ్మరి మల్లేశ్(9032126050)ను సంప్రదించాలని కోరారు.

సప్తగుండాలను సందర్శించిన అధికారులు



జలపాతం వద్ద కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్, తదితరులు

లింగాపూర్(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న సప్తగుండాల (మిట్టే) జలపాతాన్ని శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. దట్టమైన అడవిలో ప్రకృతి సోయగానికి నిలువుటద్దంలా మిట్టే జలపాతం నిలుస్తుందని వారు పేర్కొన్నారు. వారి వెంట సీఐ రమేశ్, ఆర్ఐ ప్రదీప్ తదితరులు ఉన్నారు.

నవోదయ విద్యాలయంలో ఘనంగా టీచర్స్ డే



అతిథులకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని పీఎంశ్రీ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ ప్రాంతీయ అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యార్థులను నవోదయ విద్యాలయానికి పంపిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను శ్రద్ధగా చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. అంతకుముందు విశ్రాంత ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రేపాల కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవల్లో మేటి!



102, 108 అంబులెన్స్‌లు

108లో ప్రసవం

కౌటాల(సిర్పూర్): మండలంలోని ముత్తంపేట గ్రామానికి చెందిన గర్భిణి జంగంపల్లి రేణుకకు శుక్రవారం రాత్రి పురుటి నొప్పులు రాగా 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణిని కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో సిర్పూర్(టి) మండలం టోంకిని వద్ద నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఎంటీ పిట్టల విజయ్, పైలట్ సురేశ్ వాహనంలో సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రిలో చేర్పించామని తెలిపారు.



కుటుంబ సభ్యులకు బిడ్డను అప్పగిస్తున్న సిబ్బంది

- క్షతగాత్రులు, రోగుల ప్రాణం నిలుపుతున్న '108'
- బాలింతలు, గర్భిణులకు 102 ఎనలేని సేవలు
- అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌ల్లోనే ప్రసవాలు
- ఈ ఏడాది 36 వేల మందికిపైగా లబ్ధి

వాంకిడి(ఆసిఫాబాద్): అత్యవసర సమయంలో సేవలందించడంలో 108 వాహనాలు మేటిగా నిలుస్తున్నాయి. ఆపద వేళ ఒక్క ఫోన్ కాల్‌తో క్షణాల్లో ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుల ప్రాణాలు నిలుపుతున్నాయి. గర్భిణులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 108 అంబులెన్స్‌లు 15 ఉండగా, 102 వాహనాలు మరో 15 ఉన్నాయి. మండలాల వారీగా ఆయా ఆస్పత్రుల వద్ద అత్యవసర సేవలకు సిద్ధంగా ఉంటూ పేదలకు సంజీవనిలా నిలుస్తున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని మారుమూల గ్రామాల ప్రజలకు ఈ వాహనాలు వరంలా మారాయి. బాధితుల నుంచి ఫోన్‌కాల్ వచ్చిన 15 సెకన్ల వ్యవధిలోనే ప్రయాణం ప్రారంభించి నిమిషాల్లోనే ఘటనాస్థలికి చేరుతున్నాయి. జిల్లాలో 108, 102 వాహనాల ద్వారా ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు 36,805 మంది లబ్ధి పొందారు.

108 సేవలు కీలకం..

రోడ్డు ప్రమాదాలు, గర్భిణులు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని ఆస్పత్రులకు తరలించడంలో 108 సేవలు అత్యంత కీలకం. జిల్లాలో 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 15 వాహనాలు సేవలందిస్తున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆగస్టు వరకు 108 వాహనాల ద్వారా జిల్లాలో 11,083 మంది సేవలు పొందారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రులకు చేర్చడమే కాకుండా వైద్య సదుపాయాలు అంతంతమాత్రమే ఉన్న జిల్లాలో ప్రసవాలు చేయడంలో కూడా సిబ్బంది ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. పురిటినొప్పులు ఎక్కువైన సందర్భంలో మార్గమధ్యలో వైద్యుల సూచనలతో ప్రసవం చేస్తూ తల్లీబిడ్డల ప్రాణాలు కాడుతున్నారు. 2025లో జనవరి నుంచి ఆగస్టు వరకు 47 మంది గర్భిణులకు 108 వాహనంలో ఆస్పత్రులకు వెళ్లకముందే మార్గమధ్యలో ప్రసవం చేశారు. డెలివరీ అనంతరం సమీపంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించి మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేశారు.

'అమ్మ'కు 102 సేవలు

108 అంబులెన్స్‌లతోపాటు జిల్లాలో 102 వాహనాలు ఉత్తమ సేవలందిస్తున్నాయి. 102 వాహనాలు ప్రవేశపెట్టిన తర్వాత గర్భిణులకు మెరుగైన సేవలు అందుతున్నాయని అనడంలో సందేహం లేదు. ఈ వాహనాల ద్వారానే గర్భిణులు ప్రతినెలా మంత్లీ చెకప్‌లకు సులభంగా ఆస్పత్రులకు వెళ్తున్నారు. మారుమూల గిరిజన మండలాల వారు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రితోపాటు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు వెళ్తున్నారు. వైద్య పరీక్షల అనంతరం వారిని సురక్షితంగా ఇంటి వద్ద దించుతున్నారు. గర్భం దాల్చిన మహిళల పేర్లను ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు నమోదు చేసుకుని నెలనెలా 102 వాహనాల ద్వారా సమయానుసారంగా సేవలందిస్తున్నారు. ప్రసవం అనంతరం కూడా తల్లీబిడ్డలను ఇళ్లకు చేరుస్తున్నారు. ఈ ఏడాది 102 వాహనాలు 11,335 ట్రిప్పులు తిరిగినట్లు అధికారులు వెల్లడించారు.

క్షణాల్లో ఘటనాస్థలికి..



పకడ్బందీ ప్రణాళికతో 108 వాహనాలు ఫోన్ ద్వారా సమాచారం అందిన కొన్ని క్షణాల్లోనే ఘటనా స్థలికి చేరేలా 24 గంటలపాటు అందుబాటులో ఉంచుతున్నాం. గర్భం దాల్చిన మహిళలకు మొదటి నెల నుంచే 102 వాహనాల ద్వారా సేవలందిస్తాం. నెలవారీ చెకప్‌లు, ప్రసవం అనంతరం ఇంటికి చేర్చే వరకు సేవలు పొందవచ్చు. సరైన కండిషన్‌లో ఉన్న వాహనాల్లో పైలట్‌తో పాటు ఒక ఈఎమ్‌టీ ఉండి అత్యవసర సేవలు అందిస్తారు. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంతోపాటు అత్యవసర సమయాల్లో గర్భిణులకు డెలివరీ చేస్తారు. జిల్లాలోని ప్రజలు అత్యవసర వాహనాల సేవలు వినియోగించుకోవాలి.

– సతీశ్‌కుమార్, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

వినాయకా.. వెళ్లి రావయ్యా



వాగులో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

- వైభవంగా గణపతి నిమజ్జనోత్సవం
- ఆకట్టుకున్న శోభాయాత్ర, నృత్యాలు
- బందోబస్తు పర్యవేక్షించిన ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: తొమ్మిది రోజులపాటు పూజలందుకున్న గణపయ్య గంగమ్మ ఒడికి చేరాడు. లంబోదరుడిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచిన ఆసిఫాబాద్ పట్టణవాసులు నిమజ్జనం కోసం పెద్దవాగుకు తరలించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా భక్తిగీతాలకు నృత్యాలు చేశారు. వివిధ కాలనీల్లో కొలువుదీరిన 60 విగ్రహాలను వివేకానందచౌక్, అంబేడ్కర్‌చౌక్, గాంధీచౌక్, బ్రాహ్మణవాడ, రావులవాడ, రాజంపేట, కంచుకోట మీదుగా ప్రత్యేక వాహనాల్లో శోభాయాత్రగా పెద్దవాగుకు తరలించారు. ఏఎస్పీ చిత్తరంజన్ నేతృత్వంలో పట్టణ సీఐ బాలాజీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు. ఈ సందర్భంగా బజార్‌వాడీ సమర్థసాయి గణేశ్ మండలి వద్ద ఎస్పీ కాంతిలాల్ పాటిల్ స్వామివారికి పూజలు చేశారు. ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి బైక్‌పై తిరుగుతూ బందోబస్తును పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్, పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. భారీ వర్షాలతో పెద్దవాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

లడ్డూ వేలం.. అ'ధర'హో..

బ్రాహ్మణవాడ సార్వజనిక్ గణేశ్ మండలి వద్ద నిర్వహించిన వేలంపాటలో స్వామి వారి లడ్డూ



గణపతిని తీసుకెళ్తున్న చిన్నారి

ప్రసాదాన్ని సింగాడె అశోక్ రూ.12,516కు దక్కించుకోగా, స్వామి వారి మెడలోని హారాన్ని నిమ్మకంటి సంతోష్ రూ.16,400కు దక్కించుకొన్నారు. వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో లడ్డూ ప్రసాదాన్ని కాచం గణేశ్ రూ.34,516కు, కరెన్సీ మాలను ముత్యాల ప్రదీప్ రూ.29,516కు దక్కించుకున్నారు. వేడుకలను ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ రియాజ్ అలీ, మున్సిపల్ కమిషనర్ గజానంద్ పర్యవేక్షించారు.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ, బూర్గుడతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. శిశుమందిర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని వాగులో నిమజ్జనం చేశారు.



పట్టణంలో భారీ విగ్రహంతో శోభాయాత్ర



వాగు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

దసరాలోపు ఎనిమిది రైళ్లకు హాల్టింగ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: దసరాలోపు కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఎనిమిది ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో ఎనిమిది రైళ్లకు హాల్టింగ్ కల్పించేందుకు కృషి చేశారన్నారు. సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ వరకు వయా కాగజ్‌నగర్ మీదుగా అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు– ధానాపూర్‌ల మధ్య నడిచే సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్– గోరక్‌పూర్ మధ్య నడిచే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు– పాటలీపుత్ర మధ్య నడిచే పాటలీపుత్ర ఎక్స్‌ప్రెస్ రైళ్లు కాగజ్‌నగర్ స్టేషన్‌లో నిలపనున్నారని తెలిపారు. దీంతో ఉత్తరాన బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు దక్షిణాన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుందని పేర్కొన్నారు. అలాగే మన ప్రాంతంలోని బెంగాళీలకు ప్రయాణాలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను తగ్గించడంతో దేశంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. స్మార్ట్‌కార్డులు, సిమెంట్, ఇనుము, వాహనాలకు జీఎస్టీ శాతం తగ్గించడంతో ఆర్థిక వ్యవస్థ ఊతమిచ్చినట్లు అవుతుందన్నారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనగర్ వీరభద్రచారి, పట్టణ అధ్యక్షుడు శివ, మాజీ కౌన్సిలర్లు సిందం శ్రీనివాస్, బాల్క శ్యామ్, అరుణ్‌లోయ, తిరుపి, సంతోష్, సదానందం, కోట వేణు, సాయి, చిట్టంపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎం నుంచి కలుషిత వాయువులు!

- మిల్లు గేటు ఎదుట స్థానికుల ఆందోళన



గేటు ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం) గురువారం అర్ధరాత్రి కలుషిత వాయువులు వెలువడ్డాయని స్థానిక ప్రజలు ఆరోపించారు. సర్దార్‌బస్తీ, నిజాముద్దీన్ కాలనీ, ఓల్డ్‌కాలనీ, ద్వారకానగర్, మార్కెట్ ఏరియా, లారీ చౌరస్తా, నౌగాం బస్తీ, బాలాజీనగర్, పెట్రోల్‌పంప్ ఏరియాల్లో పొగ నిండిపోవడంతో పట్టణవాసులు భయాందోళనకు గురయ్యారు. దుర్వాసన రావడంతోపాటు తల తిప్పడం, విపరీతమైన దగ్గు వస్తుందని పట్టణ ప్రజలు వాపోయారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. మిల్లు నుంచి వారానికి రెండుసార్లు రాత్రి లేదా ఉదయం 4 గంటల సమయంలో కలుషిత వాయువులు విడుదల చేస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు యజమాన్యంపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

గేటు ఎదుట ధర్నా

సిర్పూర్ పేపరు మిల్లుతో వస్తున్న కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, యాజమాన్యం స్పందించడంలేదని పట్టణంలోని ఓల్డ్‌కాలనీ, న్యూకాలనీ, పలు కాలనీల ప్రజలు శుక్రవారం ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ మిల్లు కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంటపాటు ధర్నా చేయగా యాజమాన్యం పట్టించుకోకపోవడంతో డౌన్‌డౌన్ అంటూ వెనుదిరిగి వెళ్లిపోయారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

కాగజ్‌నగర్‌టౌన్: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని, వినాయక కమిటీ నిర్వాహకులు పోలీసుశాఖకు సహకరించాలని ఏఎస్పీ రామానుజం అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మైనార్టీ భవనంలో వినాయక కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత అన్ని శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఊరేగింపు సమయంలో నిబంధనలు పాటించాలని సూచించారు. విగ్రహాలను ఘాట్ల వద్దకు కాకుండా వేరేచోటుకు తీసుకెళ్లొద్దన్నారు. ఈ సమావేశంలో టౌన్ సీఐ ప్రేంకుమార్, రూరల్ సీఐ కుమారాస్వామి, ఎస్సై సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో సలహాలు..

- జిల్లాలో మూడు మండలాల్లో అవగాహన సదస్సులు
- పంటల సాగు, మార్కెటింగ్ గురించి వివరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు
- రెండు వేల సాయిల్ టెస్టు కార్డులు పంపిణీ



పెంచికల్‌పేట్ క్లస్టర్ పరిధిలోని పత్తి పంట పరిశీలిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

పెంచికల్‌పేట్(ఆసిఫాబాద్): వర్షాకాలం పంటలు కీలక దశకు చేరుకున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. వీరితోపాటు మినిస్ట్రీ ఆఫ్ కోఆపరేటివ్ అఫైర్స్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ రీసెర్చ్‌లో రిజిస్టర్ అయిన భారతి అగ్రికల్చర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాస్త్రవేత్త, బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసిన అభ్యర్థులు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖను సమన్వయం చేసుకుంటూ గ్రామీణ రైతులకు మట్టి పరీక్షలు, శాస్త్రీయ పద్ధతుల్లో పంటల సాగు, ఎరువుల యాజమాన్యం, పంటల ఉత్తత్తి, మార్కెటింగ్‌పై మెలకువలు వివరిస్తున్నారు.

మూడు మండలాల్లో సేవలు

కేంద్ర ప్రభుత్వ అనుమతితో రాష్ట్రంలోని పలు జిల్లాలో భారతి అగ్రికల్చర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సేవలు ప్రారంభించింది. జిల్లాలోని పెంచికల్‌పేట్, సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాల్లో సంస్థ ఏప్రిల్ నుంచి సేవలు ప్రారంభించింది. ఈ మూడు మండలాల్లో ఫార్మరీ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులు 1100 మంది ఉన్నారు. ప్రతీ మూడు మండలాలకు సదరు సంస్థ ఒక అగ్రిసైంటిస్టుతోపాటు పంట చేలను సందర్శించి రైతులకు సలహాలు అందించడానికి బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసిన 11 మంది అభ్యర్థులను నియమించింది. వీరు ఎంపిక చేసిన రైతుల పంట పొలాలను నిత్యం సందర్శిస్తున్నారు. పొలాల్లో మట్టిని సేకరించి సాయిల్ టెస్టు నిర్వహించారు. దుక్కిలో ఎరువుల వాడకం, విత్తనాల ఎంపిక, ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల పిచికారీ, చీడపీడల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులతో కలిసి చేలను సందర్శిస్తూ పత్తి, వరి, మిర్చి పంటలకు సోకుతున్న తెగుళ్ల వివరాలను నమోదు చేస్తున్నారు. సాగు యాజమాన్య పద్ధతులపైనా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

రైతులకు ఉపయోగం

జిల్లాలోని మూడు మండలాల్లో ప్రస్తుతం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చేలను సందర్శిస్తున్నారు. పంటలకు సోకిన చీడపీడలను గుర్తించి రైతులకు అక్కడిక్కడే అవగాహన కల్పిస్తున్నారు. ఎలాంటి తెగులు సోకింది.. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి.. ఎలాంటి మందులు వాడాలి.. తదితర విషయాలు విరిస్తున్నారు. జిల్లాలో యూరియా కొరత నేపథ్యంలో నానో యూరియా వాడకంలో శిక్షణ అందించారు. అధిక మోతాదులో ఎరువుల వినియోగంతో కలిగే అనర్థాలను ప్రత్యక్షంగా చూపిస్తున్నారు. చీడపీడల నివారణకు పిచికారీ చేయాల్సిన రసాయనిక మందుల మోతాదు గురించి వివరిస్తున్నారు. ఇప్పటివరకు 2000 వరకు మట్టి పరీక్షల కార్డులు పంపిణీ చేశారు.

ప్రతిరోజూ సందర్శిస్తున్నాం



ఎంపిక చేసిన పంట చేలను ప్రతిరోజూ సందర్శిస్తున్నాం. రైతుల వివరాలను డిజిటల్ డేటా బేస్‌లో నమోదు చేస్తున్నాం. పంటలో సోకుతున్న చీడపీడలను పరిశీలించి నివారణకు సరైన మోతాదులో మందుల పిచికారీ చేయాలని సూచిస్తున్నాం.

– సూరం అక్షిత, ఫీల్డ్ అసిస్టెంట్, పెంచికల్‌పేట్ క్లస్టర్

ఎరువులు సక్రమంగా వాడాలి



రైతులు పంటలు సాగు చేసే ముందుగానే చేనులో మట్టి పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలి. పరీక్షల ఫలితాల ప్రకారం ఎరువులు సక్రమంగా వాడాలి. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే పెట్టుబడి పెరుగుతుంది. మరోవైపు పురుగుల మందుల వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తే ఎకరానికి రూ.6వేల వరకు ఆదా అవుతోంది. ప్రతీ రైతుకు పెట్టుబడులపై అవగాహన కల్పిస్తున్నాం.

– నజ్రానా నజర్, ఫీల్డ్ అసిస్టెంట్, పెంచికల్‌పేట్ క్లస్టర్

ప్రజల ఆరోగ్య రక్షణకు వైద్యశిబిరాలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సీతారాం

తిర్యాణి(ఆసిఫాబాద్): వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజల ఆరోగ్య రక్షణకు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్‌వో సీతారాం తెలిపారు. మండలంలోని కన్నెపల్లి, తలండి, చింతపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలను శుక్రవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విషజ్వరాలను అరికట్టేందుకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పోషకాహారం తీసుకుంటూ శుద్ధమైన నీటిని తాగాలని సూచించారు. ఆయన వెంట వైద్యులు పల్లవి, వెంకటేశ్, అక్షిత, సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా సుదర్శన్



వెల్ది సుదర్శన్

మందమర్రిరూరల్: హెచ్‌ఎంఎస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా మందమర్రికి చెందిన వెల్ది సుదర్శన్‌ను నియమిస్తున్నట్లు ఆ యూనియన్ జనరల్ సెక్రెటరీ రియాజ్ అహ్మద్ ప్రకటించారు. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ సింగరేణిలో హెచ్‌ఎంఎస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. సంస్థ గత సంవత్సరం వాస్తవ లాభాలు వెంటనే ప్రకటించాలని, ఉద్యోగులకు 40శాతం వాటా చెల్లించాలని పేర్కొన్నారు.

నాలుగు డీజేలు సీజ్

నేరడిగొండ: సుప్రీం కోర్టు నిబంధనలకు లోబడి సౌండ్ బాక్సులు ఏర్పాటు చేయాలని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ బండారి రాజు హెచ్చరించారు. గురువారం మండలంలోని వడూర్ గ్రామంలో గణపతి మండపాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన నాలుగు డీజేలు సీజ్ చేసినట్లు తెలిపారు. డీజే యజమానులతో పాటు ఆపరేటర్లపై నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గణపతి మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, సిబ్బంది ఉన్నారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు



కుక్కల దాడిలో గాయపడిన బాలిక

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లిలో తెలంగాణ మోడల్ స్కూల్ ఆవరణలో శుక్రవారం వీధి కుక్కలు దాడి చేసి చిన్నారికి తీవ్రంగా గాయపర్చాయి. ఒకటో తరగతి విద్యార్థిని అక్షిత తన తల్లితో కలిసి అక్కడికి వెళ్లింది. ఒక్కసారిగా కుక్కల మంద దాడి చేయడంతో బాలిక కిందపడిపోయింది. తల, శరీరంపై తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు కుక్కలను తరిమి చిన్నారిని కాపాడారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా శస్త్రచికిత్స చేయాలని వైద్యులు తెలిపినట్లు కుటుంబీకులు తెలిపారు. కుక్కలు స్వైరవిహారం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఇరు వర్గాలపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గణేశ్ నిమజ్జనం సందర్భంగా పరస్పరం దాడి చేసుకున్న ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన బీమనవేణి శ్రీకాంత్, మహేందర్, వరప్రసాద్, శివ శుక్రవారం గణేశ్ నిమజ్జనం సందర్భంగా టపాకాయలు కాలుస్తున్నారు. ఈ క్రమంలో మరో వర్గానికి చెందిన బాలాజీ నిప్పంటించిన ఓ టపాకాయను చేతుల్లోకి తీసుకున్నాడు. దీంతో అది పేలి అతడికి గాయమైంది. అయితే బాలాజీ, వెంకటి, తిరుమలేశ్, రాహుల్, శంకర్ మరో వర్గంతో గొడవకు దిగారు. ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నారు. పాత కక్షలు మనసులో పెట్టుకుని దాడి చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వీడని హత్య మిస్టరీ..?

- రెండు నెలల క్రితం జరిగినట్లుగా అనుమానం
- ఛత్తీస్‌గఢ్‌లో మర్డర్ కేసు.. హాజీపూర్‌లో అదృశ్యం
- కేసు దర్యాప్తునకు వచ్చిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు
- గుడిపేట వైద్యకళాశాల వెనుక పలు చోట్ల తవ్వకాలు



గుడిపేట శివారులో తవ్వకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వలస కూలీ హత్య కేసు మిస్టరీగా మారింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పోలీసుల బృందం మిస్టరీ ఛేదించే పనిలో నిమగ్నమైంది. హత్యాస్థలంగా భావిస్తున్న ప్రాంతంలో తవ్వకాలు జరిపినా మృతదేహం లభ్యం కాకపోవడంతో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ హత్య కేసు ఇటు హాజీపూర్ పోలీసులు, అటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని పోలీసులకు సవాల్‌గా మారింది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఖైరాఘర్ చుయిఖాదాన్ గండై జిల్లాలోని కాటంగి గ్రామానికి చెందిన దనావుపటేల్(38), అతడి భార్య దులేశ్వరీపటేల్ తమ పిల్లలతో కలిసి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట వైద్య కళాశాలలో పని చేసేందుకు కూలీలుగా వచ్చారు. వీరిని అదే రాష్ట్రంలోని రాజానంద్ గ్రామానికి చెందిన దులేశ్ చౌదరీ లేబర్ మేస్త్రీగా పనిలోకి తీసుకొచ్చాడు. వైద్య కళాశాల ఆవరణలోని కార్మికులకు వేసిన షెడ్లలో ఉంటూ రోజువారీ కూలీకి వెళ్తుండేవారు. ఈ ఏడాది జూన్ 16న మేస్త్రీ దులేశ్‌చౌదరీ, కూలీ దనావుపటేల్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దనావుపటేల్ ఓ పెద్ద సిమెంట్ రాయితో కొట్టడంతో దులేశ్‌చౌదరీకి గాయాలు కాగా అతడు మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆ గొడవలో దనావుపటేల్‌కు కూడా గాయాలైనట్లు తెలిసింది. కాగా, దనావుపటేల్ భార్య దులేశ్వరీపటేల్ తన పిల్లలతో కలిసి ఈ ఘటన జరిగిన రెండ్రోజులకు ఛత్తీస్‌గఢ్‌లోని తల్లిగారింటికి వెళ్లింది. దనావుపటేల్ రాకపోవడంపై అతడి సోదరుడు సేవారాం పటేల్ ఆమెను ప్రశ్నించగా.. ఎప్పుడో వచ్చాడని చెప్పడంతో కుటుంబంలో అనుమానాలు తలెత్తాయి. సేవారాంపటేల్ ఫిర్యాదు మేరకు ఆగస్టు 3న గండై పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం, అనుమానిత కేసుగా నమోదైంది. విచారణలో దులేశ్‌చౌదరీతో కలిసి తన భర్త దనావుపటేల్‌ను హత్య చేసినట్లుగా దులేశ్వరీపటేల్ అంగీకరించింది. సేవారాంపటేల్ ఫిర్యాదు మేరకు హాజీపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. దులేశ్వరీపటేల్, దులేశ్‌చౌదరీలను అనుమానితులుగా పేర్కొన్నారు. అక్కడి పోలీసులు దర్యాప్తులో భాగంగా శుక్రవారం అనుమానితులతో ఇక్కడికి వచ్చారు. హాజీపూర్ పోలీసుల సహకారంతో గుడిపేట వైద్యకళాశాల వెనక వైపు అటవీ శివారు ప్రాంతంలో నిందితులు సూచించిన మూడు ప్రాంతాల్లో జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. ఎక్కడా దనావుపటేల్ మృతదేహం లభించలేదు. మృతదేహాన్ని అక్కడ.. ఇక్కడ పాతిపెట్టామని చెప్పి చివరకు గుర్తు లేదని చెప్పడంతో పోలీసులు కంగుతిన్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది.



దనావుపటేల్‌తో భార్య దులేశ్వరీపటేల్(ఫైల్)

గణేశుడి లడ్డూ రూ.1,01,016



వేలంలో లడ్డూను దక్కించుకున్న శేఖర్



వేలంలో లడ్డూ దక్కించుకున్న వెంగళ కుమారస్వామి దంపతులు

కాసిపేట/తాండూర్: కాసిపేట మండలం ముత్యంపల్లిలో శివసాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుడి లడ్డూ వేలంలో రూ.1,01,016 ధర పలికింది. అదే గ్రామాని కి చెందిన రైతు పుట్ట మధు దక్కించుకున్నాడు. తాండూర్ మండల కేంద్రంలోని గణేష్ మండలిలో నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.51,111 ధర పలికింది. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తాండూరి బాపురావు, రజిత దంపతులు కైవసం చేసుకున్నారు. లక్ష్మీ, గణపతి ప్రతిమలను సూరినేని రవీంద్రరావు, సరోజ, దుగ్యాల హనుమంతరావు, రేఖరాణి దంపతులు సంయుక్తంగా రూ.77,777కు వేలంలో దక్కించుకున్నారు.

శివాలయం లడ్డూ రూ.52016

శ్రీరాంపూర్: నస్పూర్ నాగార్జున కాలనీలోని కాశీవిశ్వేర శివాలయం గణపతి లడ్డూ రూ.52016 ధర పలికింది. నిమజ్జనం సందర్భంగా ఆలయ కమిటీ శుక్రవారం లడ్డూ వేలం వేసింది. కాలనీకి చెందిన కార్మికుడు వెంగళ కుమారస్వామి వేలంలో దక్కించుకున్నాడు. ఏరియాలో అత్యధిక ధర పలికిన లడ్డూ ఇదే కావడం గమనార్హం.

యోగాలో జాతీయస్థాయిలో రాణించాలి

నిర్మల్ టౌన్: యోగా క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి అవార్డులు తీసుకురావాలని తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నందన కృపాకర్ అన్నారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న 6వ తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్మల్ జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో 24 జిల్లాల నుంచి 521 మంది యోగాసన క్రీడాకారులు ట్రెడిషనల్, బ్యాక్ బెండ్, ఫార్వర్డ్ బెండ్, స్పైన్, రితమిక్, ఆర్టిస్టిక్‌లతో పాటు వివిధ ఈవెంట్‌లలో ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు విద్యతోపాటు ఉద్యోగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తున్నాయని తెలి పారు. కార్యక్రమంలో నేషనల్ అబ్జర్వర్ దయాని ధి, యోగాసనా స్పోర్ట్స్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రామ్‌రెడ్డి, తోట సతీశ్, నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, కార్యదర్శి మల్లేశ్, ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణంరాజు, డాక్టర్ జగన్నాథం, డాక్టర్ శ్వేత, పేటా అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి భోజన్న, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్, వివిధ జిల్లాల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు క్రీడాకారులు పాల్గొన్నారు.



యోగాసన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

పీవీటీజీల సంక్షేమానికి కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్
- 402 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ

ఇంద్రవెల్లి: ఆదివాసీ తెగల్లో అన్ని రంగాల్లో వెనుకబడిన పీవీటీజీ కొలాం, తోటిల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కలెక్టర్ రాజర్షిషా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి 402 మందికి పీఎం జన్‌మన్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్ కార్యక్రమంలో కొలాం, తోటి ఆదివాసీలకు ఎలాంటి నిబంధనలు లేకుండా ఇళ్లు మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.24వేల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రతీ కుటుంబానికి ఇళ్లు మంజూరు చేయడంతో పాటు రేషన్, ఆధార్ కార్డులు అందజేస్తుందని పేర్కొన్నారు. విద్యుత్, డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తుందని, ఉపాధిహామీ కింద సీసీ రోడ్లు, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి కృషి చేస్తుందని చెప్పారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి డబ్బులు లేకుంటే మహిళా సంఘాల ద్వారా బ్యాంక్ రుణాలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రుణం ఇవ్వడానికి డీఆర్డీవోతో మండల, బ్యాంక్ అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేస్తున్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాజర్షిషా

సావర్‌ఖేడా పాఠశాలను సందర్శిస్తాం

- సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- హెచ్‌ఎం రంగయ్య దంపతులకు సన్మానం

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవంలో ప్రత్యేక ఆహ్వానితులుగా సావర్‌ఖేడా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కడేర్ల రంగయ్య ఆయన సతీమణి వీణను సన్మానించారు. హెచ్‌ఎం రంగయ్యతోపాటు ఉచితంగా బోధన చేస్తున్న ఆయన సతీమణి వీణను అభినందించారు. ప్రమోషన్ వచ్చినా వెళ్లకుండా విద్యార్థుల ఉన్నతికి కృషి చేయడం గొప్ప విషయమన్నారు. గ్రామానికి స్వయంగా వెళ్తానని హామీ ఇచ్చారు. సీఎం చేతుల మీదుగా సన్మానం అందుకోవడం గొప్ప అనుభూతి అని రంగయ్య తెలిపారు.



రంగయ్య దంపతులను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్/మామడ: వినూత్న బోధనతో విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఖానాపూర్ మండలం మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బోనగిరి నరేందర్‌రావు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలాస్, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, ఉన్నతవిద్యాశాఖ కమిషన్ శ్రీదేవసేన చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. మామడ మండలం పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైస అరవింద్‌కుమార్ కూడా రాష్ట్ర విద్యాశాఖ సెక్రెటరీ యోగితారాణా చేతులమీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. టీచర్లు, వీడీసీ, పోషకుల సహకారంతో అవార్డులు అందుకున్నామని పేర్కొన్నారు.





ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకుంటున్న నరేందర్‌రావు, అరవింద్‌కుమార్

ఐదుగురు ఆకతాయిలపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలను వేధిస్తున్న ఐదుగురు ఆకతాయిలపై వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు షీటీం ఇన్‌చార్జి సుశీల తెలిపారు. గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌పేట కాలనీలోగల కుమార్ జనతా గణేశ్ మండలి వద్ద వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చిన మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ వికృత చేష్టలకు పాల్పడిన మయూర్, సిద్ధూ, కార్తిక్, గణేశ్, వినాయక్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మహిళలు అత్యవసర సమయాల్లో 'డయల్ 100, ఆదిలాబాద్ షీటీమ్ 8712659953 నంబర్లను సంప్రదించాలని సూచించారు. షీటీం బృంద సభ్యులు హెడ్ కానిస్టేబుల్ వాణిశ్రీ, సిబ్బంది మహేశ్, రోహిణి, లావణ్య తదితరులున్నారు.



ఆకతాయిలతో షీ టీం సభ్యులు

అనుమానాస్పదంగా వివాహిత మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలం రాంపూర్‌కు చెందిన చాపిడి రాణి(25) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలి తల్లి కొత్తపల్లి భాగ్య తెలిపిన వివరాల ప్రకారం.. కైరిగాంకు చెందిన రాణిని నాలుగేళ్ల క్రితం రాంపూర్‌కు చెందిన చాపిడి ప్రశాంత్‌తో వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వారం క్రితం కుమార్తెను కొన్నిరోజులు పుట్టింటికి తీసుకెళ్తానని ఆమె తల్లి కోరగా ప్రశాంత్ నిరాకరించాడు. ఈ నెల 4న కాగజ్‌నగర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి రాణి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయిందని ప్రశాంత్ ఆమె తల్లి భాగ్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకుని తాము రాంపూర్‌కు వచ్చేలోగా రాణి మృతదేహాన్ని నేలపై పడుకోబెట్టారని, తన కుమార్తె మరణంపై భర్త ప్రశాంత్‌తోపాటు అత్త చాపిడి కమలపై అనుమానం ఉందని భాగ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



రాణి మృతదేహం

వాగులోపడి యువకుడి మృతి

సారంగాపూర్: మండలంలోని బండరేవు తండాకు చెందిన కరాడే ఈశ్వర్(22) ప్రమాదవశాత్తు స్వర్ణ వాగులో పడి మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బండరేవు తండాకు చెందిన ఈశ్వర్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం అతిగా మద్యం సేవించి గ్రామ సమీపంలోని వాగువద్దకు వెళ్లాడు. మైకంలో అదుపుతప్పి వాగులో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఈశ్వర్ కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం కోసం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈశ్వర్ తండ్రి ఖండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఈశ్వర్ మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్

భవన నిర్మాణ కార్మికుడి దుర్మరణం

ఉట్నూర్‌రూరల్: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారి పడ్డ భవన నిర్మాణ కార్మికుడు దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఫకీర్ గుట్టకు చెందిన మల్లెల రాములు (45) తాపీమేస్త్రీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజులాగే శుక్రవారం మండల కేంద్రానికి పనికివెళ్లాడు. అక్కడ భవనం గోడపై నిల్చుండి ప్లాస్టరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పక్కనే ఉన్న మరో గోడపై పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతడిని వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రాములు మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలున్నారు.

ఆర్జీయుకేటీలో మ్యాట్‌ల్యాబ్ బూట్ క్యాంపు

బాసర: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయుకేటీ) బాసరలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నెక్సస్ క్లబ్ మ్యాట్‌ల్యాబ్ బూట్ శిక్షణ శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు మ్యాట్‌ల్యాబ్, మాత్రికా పరికర్మ, భావన, చిత్రీకరణ, కృత్రిమ వాతావరణ కల్పనలపై ప్రాథమిక అవగాహన కల్పించేందుకు ఈ క్యాంపు ఏర్పాటు చేశారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్, ఓఎస్డీ మురళీదర్శన్, ప్రొఫెసర్లు డాక్టర్ కె.మహేశ్ సమక్షంలో ఈ శిబిరం ప్రారంభమైంది. ఐఐటీ ముంబైలో పీఎంఆర్ఎఫ్ ఫెలో అయిన బిశ్వజిత్ సాహూ మ్యాట్ ల్యాబ్ ప్రాథమిక అంశాలు, యంత్రశాస్త్రం, పరిశోధనలో అనువర్తనాలపై అవగాహన కల్పించారు. ప్రయోగాత్మక ప్రదర్శనలు చేశారు. మొదటి రోజు, ఈ2, ఈ3 తరగతుల నుంచి 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొని, మ్యాట్ ల్యాబ్ ప్రాథమిక అంశాలు, విద్యుత్, యంత్రశాస్త్రంలో దానిపాత్ర, సమస్య పరిష్కారంలో అనువర్తనాలపై విలువైన అవగాహన పొందారు. మూడు రోజులు క్యాంపు కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థి సమన్వయకర్తలు జి.వంశీ, సర్దార్ పుల్లాసింగ్, అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ భుక్యా భావ్సింగ్, ఈఈఈ హెచ్‌వోడీ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్ ముత్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ భూక్య కార్యక్రమంలో పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి(40) ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ బి.సత్యనారాయణ తెలిపారు. మంచిర్యాల శివారులోని గోదావరి బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఘటన జరిగిందని పేర్కొన్నారు. గుర్తుపట్టలేనంతగా శరీరం నుజ్జునుజ్జు అయిందని, ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్లు లభించలేదని తెలిపారు. మృతుడి ఒంటిపై నల్ల రంగు ప్యాంటు, నల్లరంగు చొక్కా ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామని, వివరాలకు 9701112343, 9618689879 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవెనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. రణదీవెనగర్‌కు చెందిన తొన్కుర్ విలాస్ (52) వడ్రింగి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి భార్య సవిత, ఇద్దరు కుమార్తెలున్నారు. కాగా, ఇద్దరు కూతుళ్లకు వివాహాలు చేశాడు. 20రోజుల క్రితం పెద్ద కూతురు డెలివరీ కాగా అతడి భార్య సవిత ఆమె వద్దకు వెళ్లింది. దీంతో ఆయన మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో చిన్నారి మృతి



హైందవి(ఫైల్)

వేమనపల్లి: మండల కేంద్రం వేమనపల్లికి చెందిన నాగుల అమరేష్, సోని దంపతుల కూతురు హైందవి(6) గురువారం రాత్రి బ్రెయిన్ ట్యూమర్‌తో మృతిచెందింది. ఆరు నెలలుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతోంది. నిరుపేద అమరేష్ గ్రామంలో స్వర్ణకారుడిగా, పంపు మేకానిక్‌గా పని చేస్తున్నాడు. పాప ఆరోగ్యం బాగు కావాలని ఎన్నో ఆస్పత్రులకు తీసుకెళ్లి చికిత్స చేయించాడు. రూ.16 లక్షలు అప్పు చేసి వైద్యం కోసం ఖర్చు చేసినా ఆరోగ్యం మెరుగుపడలేదు. గురువారం రాత్రి ఇంటి వద్దే మృతిచెందింది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

జ్వరంతో మహిళ..

తిర్యాణి(ఆసిఫాబాద్): తిర్యాణి మండలం గోయెగాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామానికి చెందిన నాయుడి రాజక్క(45) అనే మహిళ విషజ్వరంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి భర్త లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజక్కకు ఐదు రోజుల క్రితం జ్వరం రాగా, మండల ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు రోజులు చికిత్స అందించారు. అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. వరంగల్ తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించగా, ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇంటికి తిరిగి వచ్చి నట్లు లక్ష్మణ్ తెలిపారు. ఈ క్రమంలో గురువారం రాత్రి పరిస్థితి విషమించి రాజక్క మృతి చెందింది. అయితే రాజక్క డెంగీతోనే మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మెడికల్ కాంపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

చెట్టును ఢీకొన్న ఆటో: ఒకరి మృతి

మోర్తాడ్(బాల్కొండ): ఓ ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిర్మల్‌కు చెందిన పోగుల సత్యనారాయణ (48) గురువారం రాత్రి ఓ పని నిమిత్తం సమీప బంధువుతో కలిసి ఆటో నడుపుకుంటూ ఏర్గట్ల గ్రామానికి వచ్చాడు. పని ముగిసిన అనంతరం అర్ధరాత్రి తిరిగి నిర్మల్‌కు బయల్దేరాడు. ఏర్గట్ల పోలీసుస్టేషన్ పరిధిలోని బట్టాపూర్-తొర్తిల మధ్య ఉన్న రోడ్డుపై ఆటో అదుపుతప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.